సాక్షి ఒడిశా

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,63,423లు, బంగారం 2గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 5గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రధాని రోడ్ షో

ఝార్సుగుడ పర్యటనలో భాగంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. - IIలో



పర్యాటక కేంద్రాల అభివృద్ధి

పర్లాకిమిడి బృందావన్ ప్యాలస్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. పర్యాటకాభివృద్ధికి అధికారులు మాట్లాడారు. - IIలో

న్యూస్‌రీల్

మందుగుండు సామగ్రి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రితో నబరంగ్‌పూర్ పోలీసులు

కొరాపుట్: అక్రమంగా నిల్వ చేసిన మందుగుండు సామగ్రిని నబరంగ్‌పూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఎస్‌ఐ గణేష్ పట్నాయక్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా నిబంధనలకు విరుద్ధంగా మందుగుండు నిల్వ ఉంచినట్లు గుర్తించినట్లు చెప్పారు. బి.సూరజ్, వి.ఉమాశంకరరావు, కె.శ్రీధర్‌లపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మందుగుండు సామగ్రిని సీజ్ చేశామన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కొరాపుట్ : కేవుటి వీధిలో జరుగుతున్న పేకాట శిబిరంపై నబరంగ్‌పూర్ పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.35,260 నగదు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ నవీన్

రాయగడ : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాయగడ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్ మాట్లాడుతూ పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రాధాన్యం కల్పిస్తోందని చెప్పారు. చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక విభాగం అధికారి సుస్మిత బౌరి, జిల్లా పర్యాటక శాఖ అధికారి మనోజ్‌కుమార్ నాహక్ పాల్గొన్నారు.

మహిళపై దాడి

- నాలుగు తులాల పుస్తెలతాడు తెంచివేత



బంగారంపోగొట్టుకున్న జగదాంబ

రాయగడ: గుర్తు తెలియని ఇద్దరు దుండగులు మహిళపై దాడి చేసి మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెతాడును తెంపుకొని వెళ్లిపోయిన ఘటన శనివారం స్థానిక మజ్జివీధి కూడలిలో చోటు చేసుకుంది. కేసీసీబీ రోడ్డు సమీపంలో నివసిస్తున్న నారంశెట్టి జగదాంబ ఉదయం మజ్జివీధి సమీపంలోని కిరాణా దుకాణానికి పాలు ప్యాకెట్ కొనేందుకు వెళ్లింది. అదే సమయంలో ఇద్దరు దుండగులు ముందుగా మజ్జివీధి కూడలిలో కాపుకాసి ఆమెను అనుసరించి వెనుక నుంచి కర్రతో ఆమె తలపై గాయపరిచి కిందపడిన తరువాత మెడలోని పుస్తెల తాడును తెంపుకు వెళ్లిపోయారు. గాయాలతో పడిపోయి ఉన్న ఆమెను చూసిన స్థానికులు కుటుంబీకులకు తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకుని ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అనంతరం సదరు పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పట్టపగలే ఇటువంటి దొంగతనాలు చోటు చేసుకోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఓటీఈటీకి 2,259 మంది హాజరు

రాయగడ: రాష్ట్ర మాధ్యమిక విద్యా పరిషత్ శనివారం నిర్వహించిన ఒడిశా టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (ఓటీఈటీ)కు రాయగడ జిల్లా నుంచి 2259 మంది అభ్యార్థులు హాజరయ్యారు. జిల్లాలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. జిల్లాలో 2365 మంది దరఖాస్తు చేశారు. పరీక్షకు 106 మంది గైర్హాజరయ్యారు. గైర్హాజరైన వారిలో పేపర్-1కి 41 మంది, పేపర్-2కు 65 మంది ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలకు నిర్వహించిన మొదటి పరీక్షలు ఉదయం 9 నుండి 11.30 గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలియజేశారు. ఈ ఏడాది జూలై 20న జరిగిన ఈ పరీక్షలకు సంబంధించి పేపర్ లీకేజ్ కావడంతో రద్దు చేసిన విషయం తెలిసిందే.

ఒడిశాకు వరాల జల్లు



జెండా ఊపి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ప్రారంభించిన ప్రధాని మోదీ



బరంపురం స్టేషను నుంచి బయల్దేరిన సూరత్ అమృతభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

- రాష్ట్రంలో రూ.1700 కోట్ల పైబడి రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోదీ
- గుజరాత్, ఒడిశా మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ప్రారంభం

భువనేశ్వర్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒక రోజు రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని రాష్ట్ర రైల్వే రంగానికి వరాల జల్లు కురిపించారు. ఝార్సుగుడలో శనివారం అట్టహాసంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాన మంత్రి రూ.1,700 కోట్ల పైబడి విలువైన రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు ప్రభాతి పరిడా, కనక వర్ధన్ సింగ్ దేవ్, కేంద్ర మంత్రి జుయెల్ ఓరాం, రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్‌కుమార్ పూజారి తదితరులు పాల్గొన్నారు.

అమృత్‌భారత్ ప్రారంభం..

గుజరాత్‌లోని సూరత్ (ఉధ్నా), రాష్ట్రంలో గంజాం జిల్లా బరంపురం మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుసేవలను ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించారు. సామాన్య, మధ్య తరగతి వర్గాలకు ప్రధానంగా ఇరు రాష్ట్రాల్లో కార్మిక వర్గాలకు ఈ రైలు సేవలు దోహదపడతాయని గంజాం జిల్లా ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డబల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటు తర్వాత బరంపురం రైల్వే రంగంలో ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంటోంది. అందుకు తార్కాణంగా గుజరాత్, గంజాం జిల్లా మధ్య ప్రత్యక్ష అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు ప్రారంభంగా స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర మంత్రులు ఆనందం వ్యక్తం చేశారు. బరంపురం - సూరత్ (ఉధ్నా) అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలతో రాష్ట్రంలో గంజాం, రాయగడ, కలహండి, బొలంగీరు, నువాపడా, ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, ఛత్తీస్‌గడ్‌లో మహాసముంద్, రాయ్‌పూర్, దుర్గ్, మహారాష్ట్రలో గోండియా, నాగ్‌పూర్, వార్ధా, అమరావతి, అకోలా, బుల్ధానా, జలగాంవ్, ధూలే, నందర్బార్, గుజరాత్‌లో సూరత్ జిల్లాల ప్రజలకు లబ్ధి చేకూరనుంది.



ఝార్సుగుడ బహిరంగ సమావేశంలో పాల్గొన్న ప్రధాని, గవర్నర్, సీఎం తదితరులు

- రూ. 273 కోట్లు వ్యయ ప్రణాళికతో సంబల్‌పూర్, సర్లా మధ్య రైలు ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. వంతెన నిర్మాణం సర్లా స్టేషన్ వద్ద రద్దీని తొలగించి రద్దీగా ఉండే సంబల్‌పూర్ - ఝార్సుగుడ మార్గంలో రైళ్ల నిరంతర కదలికతో బొగ్గు, ఖనిజ, పారిశ్రామిక సరుకు రవాణాకు మార్గం సుగమం చేయనుందని, పారిశ్రామిక విస్తరణతో ముడిపడిన ఆర్థిక పురోగతి గణనీయంగా ఊపందుకుంటుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.
- కొరాపుట్ - బైగూడ మార్గంలో రూ. 481 కోట్ల వ్యయంతో 34 కిలోమీటర్ల పొడవున డబ్లింగు ప్రాజెక్టుని ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. ఈ మార్గంలో ఖనిజాలు, వ్యవసాయ ఉత్పత్తుల తరలింపును సులభతరం అవుతుంది. కొరాపుట్ ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధికి దోహదపడుతుంది.
- మనబార్ - కొరాపుట్ - గోరాపూర్ మార్గంలో రైలు మార్గం రెట్టింపు రూ. 955 కోట్ల విలువైన 82 కిలోమీటర్ల పొడవైన డబ్లింగు ప్రాజెక్టు జాతీయ ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ ప్రాజెక్టుతో బైలాడిల్లా గనులు, దేశ వ్యాప్తంగా ఉక్కు కార్ఖానాలకు ఇనుప ఖనిజం రవాణా వేగవంతమై బహుముఖ అభివృద్ధికి దోహదపడుతుంది. కొరాపుట్ (ఒడిశా), విశాఖపట్నం (ఆంధ్రప్రదేశ్) జిల్లాల్లో ప్రయాణికుల, సరుకు రవాణా రంగంలో రైలు సేవలు మెరుగుపడతాయి.

పాలన భేష్



సీఎం మోహన్‌చరణ్‌తో ప్రధాని మోదీ



గవర్నర్ హరిబాబుతో ప్రధాని మోదీ

- రాష్ట్ర నాయకత్వంపై ప్రధాని మోదీ భరోసా
- గవర్నర్, సీఎంలకు అభినందనలు

భువనేశ్వర్: ఒక రోజు రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని శనివారం ఝార్సుగుడలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వం పట్ల గట్టి నమ్మకం వ్యక్తం చేశారు. తొలుత రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రధానికి స్వాగతం పలికారు. వీరివురి పట్ల ప్రధాని ఆత్మీయతను ప్రదర్శించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర గవర్నర్ పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమని కొనియాడారు. ప్రజల వద్దకు ప్రభుత్వ పాలన చేరదీయడంలో అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. ఇదే ప్రేరణతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రజాభిమాన నేతగా మన్ననలు పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రజా ప్రభుత్వం సరికొత్త చరిత్రని ఆవిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అన్నింటా ప్రగతిపథంలో దూసుకుపోతోందన్నారు. మోహన్ చరణ్ మాఝి ప్రజాభిమాన (లోకప్రియ), నిబద్ధతతో కష్టపడి పనిచేసే (కర్మఠ) ముఖ్యమంత్రిగా వెలుగొందుతున్నారని ప్రశంసల జల్లు కురిపించారు.

విపక్షంపై నో కామెంట్..

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రధాన ప్రతిపక్షం బిజూ జనతా దళ్ నిత్యం విమర్శనాస్త్రాలు సంధిస్తూ కించపరుస్తుండగా ఝార్సుగుడ బహిరంగ సభా కార్యక్రమంలో ప్రధాని మోదీ రాష్ట్రంలో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ పట్ల స్పందించకపోవడం గమనార్హం. ఇటీవల విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శస్త్రచికిత్స సందర్భంగా ఆప్యాయంగా పరామర్శించి బాగోగుల్ని పర్యవేక్షించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో పాలన నేపథ్యంలో అధికార, విపక్షాల మధ్య బేదాభిప్రాయాలు భగ్గుమంటున్న తరుణంలో ప్రధాన మంత్రి బిజూ జనతా దళ్ పట్ల ఎటువంటి వ్యాఖ్యలు చేయకుండా హుందాతనం చాటుకున్నారు. మరో వైపు ప్రధాన మంత్రి ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలో దోపిడీ తంత్రంతో దేశాన్ని నిలువునా కొల్లగొట్టిందని ఘాటుగా వ్యాఖ్యానించారు.

మిషన్ శక్తి సిబ్బంది ధర్నా



రాయగడ బ్లాక్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మిషన్ శక్తి సపోర్టు సిబ్బంది



రాయఘడ బ్లాక్ ఎదుట ఆందోళన చేస్తున్న మిషన్ శక్తి ప్రాణిమిత్ర, బ్యాంకు మిత్ర కార్యకర్తలు

పర్లాకిమిడి: మిషన్ శక్తి కమ్యూనిటీ సపోర్టు సిబ్బంది సి.ఆర్.పి, ఎం.బి.కె, కృషిమిత్ర, ప్రాణమిత్ర, బ్యాంకు మిత్ర, క్యాడర్ల కింద సేవలు అందిస్తున్న మహిళా సంఘం సభ్యులు శనివారం గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మిషన్ శక్తి సంఘం అధ్యక్షురాలు సంయుక్తా ప్రధాన్ మాట్లాడుతూ మహిళా కార్యకర్తలకు ఆరు నెలలుగా గౌరవ వేతనాలు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర మిషన్ శక్తి సంఘం ఆదేశాల మేరకు ఆరు రోజులుగా రాయఘడ బ్లాక్ ఎదుట ధర్నా చేస్తున్నా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. మిషన్ శక్తి సపోర్టు సిబ్బందికి ఆరు నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని, కార్యకర్తల జీతం బ్యాంకు ఖాతాల్లో జమ చేసి, ఉద్యోగాలు రెగ్యులర్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అనంతరం రాయగడ బి.డి.ఓ. సుశాంత్ కుమార్ ప్రధాన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన స్పందిస్తూ మిషన్ శక్తి విభాగం నుంచి జీతభత్యాల విషయమై ఇంతవరకూ ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పారు.

జయపురం యువరాజుకు సన్మానం



యువరాజును సన్మానిస్తున్న ఆదివాసీలు

జయపురం: జయపురంలో రాజుల కాలం నుంచి సంప్రదాయంగా నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల సందర్భంగా జయపురం రాజవంశ వారసుడు యువరాజు బిశ్వంబర చంద్ర చూడ్ దేవ్‌ను శనివారం ఆదివాసీలు సన్మానించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం యువరాజుకు సాంప్రదాయ కిరీటంతో అలంకరించి దనస్సు, బాణాలు అందజేశారు. జయపురం సమితి బాగ్దేరి పంచాయతీ నుంచి వచ్చి సన్మానించిన ఆదివాసీలకు యువరాజు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా కళాశాలలో ఆరోగ్య శిబిరం



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ అధికారి కృష్ణచంద్ర పండిట్



విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ భారతీ పాణిగ్రాహి

పర్లాకిమిడి: స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో నారీ ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని శిబిరాన్ని అధ్యక్షురాలు డాక్టర్ రీనా సాహు ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ అధికారులు శనివారం నిర్వహించారు. స్వస్థ్య నారీ.. స్వస్థ పరివార్ అభియాన్ కార్యక్రమంలో విశ్రాంత అధ్యక్షురాలు డాక్టర్ భారతీ పాణిగ్రాహి, జిల్లా మెడికల్ శాఖ తరపున వి.లక్ష్మీకుమారి పట్నాయక్, సంతోషీకుమారీ జెన్నా తదితరులు విద్యార్థినులకు రక్తపరీక్షలు జరిపారు. కార్యక్రమాన్ని రెడ్‌క్రాస్ అధికారి, క్రిష్ణ చంద్ర గజపతి కళాశాల అధ్యాపకులు కృష్ణచంద్ర పండిట్ పర్యవేక్షించగా, మహిళా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దసరా సెలవులకు ఇంటికి వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం
- స్వల్ప గాయాలతో బయటపడిన సోదరుడు



రాహుల్ నాయక్ (ఫైల్)



ఘటనా స్థలంలో బైక్

రాయగడ : పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో ఆనందంగా ఇంటికి వెళ్తున్న ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సదరు సమితి చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాకురుగుడ కూడలిలో శనివారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. కాసీపూర్ సమితి సింధూరఘాటి పంచాయతీ డెరకొన గ్రామానికి చెందిన రాహుల్ నాయక్ (14) పెనికొన ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు ప్రకటించడంతో సోదరుడు లోచన్ నాయక్‌తో కలిసి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. బాకురుగుడ వద్ద ఎదురుగా వస్తున్న లారీని అదుపుతప్పి ఢీకొనడంతో బైక్ వెనుక కూర్చున్న రాహుల్ కిందపడ్డాడు. ఈ ఘటనలో లారీ వెనుక చక్రం కిందపడి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. లోచన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

39 కిలోల గంజాయి పట్టివేత

- వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అరెస్టు



మర్లబ వద్ద పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది



మల్కన్‌గిరి: గంజాయితో ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన నిందితులు

పర్లాకిమిడి: ఎక్సైజ్ అధికారులు చేపట్టిన వేర్వేరు దాడుల్లో 39 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ ఘటనతో సంబంధం ఉన్న ముగ్గురిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం ఆర్.ఉదయగిరి బ్లాక్ మర్లబ గ్రామం వద్ద పోలీసులు దాడులు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు బొలేరో వాహనంలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి మూడు బస్తాల్లో ఉన్న 39 కిలోల గంజాయి పట్టుబడింది. పట్టుబడిన వారిలో పశ్చిమబెంగాల్ రాష్ట్రం హుగ్లీ జిల్లాకు చెందిన కమల్ ఉద్దీన్, మోహానా బ్లాక్ శికులిపదర్ గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు నాలుగు లక్షల రూపాయలు ఉంటుందని అబ్కారీ శాఖ సదర్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కుమార్ పటేల్ తెలియజేశారు. మరో గంజాయి కేసును ఆర్.ఉదయగిరి పరిసర గ్రామం వద్ద మహమ్మద్ సంసద్ అన్సారీ వాహనం కోసం ఎదురుచూస్తుండగా మొబైల్ అబ్కారీ టీంకు పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి ఒక బ్యాగులో తరలించేందుకు ఉంచిన గంజాయితో పట్టుబడినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మొన్ను ఆయాల్ తెలిపారు. నిందితులు ముగ్గుర్ని శనివారం జిల్లా మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. దాడుల్లో ఎక్సైజ్ శాఖ మొబైల్ ఎస్సై కె.బాలజీరావు, ఏఎస్సైలు నీలాంబర్ నాయక్, బిజయానంద బెహరా ఉన్నారు.

కలిమెల సమితిలో 40 కిలోలు..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి 40 కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. బేజాంగ్‌వాడ రహదారి కలువ వద్ద శుక్రవారం రాత్రి కలిమెల ఎక్సైజ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ దీపక్ కుమార్ సామల్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఓ పికాప్ వాహనం అతివేగంగా రవడంతో దాన్ని ఆపి ప్రశ్నించగా అందులో ఉన్నవారు సరైన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో అనుమానంతో వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. రెండు బస్తాల్లో గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరి అరెస్టు చేసి కలిమెల ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. శనివారం పట్టుబడిన గంజాయిని తూకం వేయగా 40 కిలోలు ఉందని.. దీని విలువ రూ. 3.50 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. అరెస్టయిన వారిలో మోటు గ్రామ మాజీ సర్పంచ్ మున్న సోడి, పుసుగూఢ గ్రామానికి చెందిన ఆశిష్ సాల్బాం ఉన్నారన్నారు. వీరిపై కేసునమోదు చేసి కోర్టుకు తరలించినట్టు పేర్కొన్నారు

ఝార్సుగుడలో.. ప్రధాని రోడ్ షో



కళకళలాడిన ఝార్సుగుడ వీధులు



కార్యక్రమంలో స్థానికుల ఉత్సాహం



ఝార్సుగుడ వీధుల్లో ప్రధాని మోదీ రోడ్ షో

ఝార్సుగుడ పర్యటనలో భాగంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రోడ్ షోలో పాల్గొన్నారు. విమానాశ్రయం నుంచి సభా ప్రాంగణం మార్గంలో దారి పొడవునా ప్రజలకు అభివాదం చేసుకుని ముందుకు సాగారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

– భువనేశ్వర్

క్లుప్తంగా

పర్యాటక కేంద్రాల అభివృద్ధికి నిధుల మంజూరు



మాట్లాడుతున్న అధికారులు

పర్లాకిమిడి: స్థానిక బృందావన్ ప్యాలస్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జిల్లా అధికారులు శనివారం నిర్వహించారు. జిల్లా అదనపు మాజిస్ట్రేట్ ఫల్గుణి మఝి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జి పర్యాటక అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, ప్రమోద్ పాఢీ, అంజనా పట్నాయక్ హాజరయ్యారు. జిల్లాలో ప్రసిద్ధ మహేంద్రగిరి, గండాహతి, గుడ్ గుదా, ఖసడా జలపాతాల వద్ద ప్లాస్టిక్ కవర్లు, సీసాలు పడవేయకుండా పరిశుభ్రత పాటించాలని ఏడీఎం అన్నారు. జిల్లాలో చంద్రగిరి బౌద్ధరామాలు, బృందావన్ ప్యాలస్, గండాహతి, మహేంద్రగిరి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలోనే టూరిజం రిసార్టులు, నక్షత్ర హోటళ్లు నిర్మించనున్నారని పర్యాటక అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి అన్నారు. విద్యార్థులకు 'పర్యాటకం, స్థిరమైన అభివృద్ధి' అనే అంశంపై క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ఏడీఎం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యాటక శాఖ సిబ్బంది సుధీర్ కుమార్ హోత్త, బిచిత్రానంద బెబర్తా సహకరించారు.

ఈఈ బాధ్యతల నుంచి తప్పించండి

శ్రీకాకుళం: శ్రీకాకుళం ఏపీహెచ్ఎంహెచ్ఐడీసీకి ఇన్‌చార్జి ఈఈ ఉన్నటువంటి తనను ఆ బాధ్యతల నుంచి తప్పించాలని ప్రమోద్‌కుమార్ ప్రధాన కార్యాలయానికి లేఖ రాసినట్లు తెలిసింది. విశాఖపట్నంలోని ఇదే విభాగంలో క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా పనిచేస్తున్న ఆయనను ఈనెల 1వ తేదీన ఇన్‌చార్జి ఈఈగా నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటికీ.. తరచూ సెలవు పెడుతూ వస్తున్నారు. ఐదు రోజుల క్రితం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రిమ్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంలో ఇంజినీరింగ్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో సెలవు పెట్టిన ప్రమోద్ కుమార్ శనివారం ప్రధాన కార్యాలయానికి వెళ్లి లిఖితపూర్వకంగా తనను ఈ బాధ్యతల నుంచి తప్పించాలని కోరినట్లు తెలిసింది. ఈ విషయంపై సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. డీఈఈ సిమ్మన్న వద్ద ప్రస్తావించగా లేఖ రాసిన విషయం తెలిసిందని, అయితే దీనిని అధికారికంగా ధ్రువీకరించుకోవాల్సి ఉందని తెలిపారు.

భార్య మందలించిందని...

నరసన్నపేట: మండలంలోని కంబకాయకు చెంది న కెల్ల రాజారావు(34) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం సాయంత్రం గడ్డి మందు తాగడంతో కుటుంబసభ్యులు గమనించి నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందు తూ శనివారం ఉదయం మరణించినట్లు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. భార్య రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా సరుబుజ్జిలి మండలం చిగురువలసకు చెందిన రాజారావు కంబకాయకు చెందిన రామలక్ష్మిని వివాహం చేసుకొని ఇక్కడే ఇల్లరి కం ఉంటున్నారు. అప్పుడప్పుడు భార్యాభర్తల మధ్య చిన్న చిన్న మనస్పర్థలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం వీరిద్దరూ ఘర్షణ పడగా, భార్య రామలక్ష్మ రాజారావును మందలించింది. దీనిని తట్టుకోలేక రాజారావు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా రాజారావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రవాణా సదుపాయాలతో అభివృద్ధి

ఆమదాలవలస: ఏదైనా ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రవాణా సదుపాయాలు అత్యంత ముఖ్యమ ని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన బెర్హంపూర్ – సూరత్ (ఉద్నా) అమృత్ భారత్ రైలును శనివారం శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వే స్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమృత్ భారత్ రైలు దేశ రైల్వే రూపురేఖలు మార్చిందన్నారు. శ్రీకాకుళం, పలాసలో రెండు హాల్ట్‌లు ఇచ్చినట్లు తెలిపారు. విమానాల్లో ఉండే సదుపాయాలు అమృత్ భారత్ రైళ్లలో ఉన్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైల్వే డీఆర్ఎం లలి త్ బొహ్రా, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీసీసీబీ అధ్యక్షుడు శివ్వల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం ప్రజలకు వరం

పలాస: బరంపురం నుంచి సూరత్ వెళ్లే అమృత్ భారత్ రైలు ఉద్దానం ప్రాంత ప్రజలకు వరం లాంటిదని ఖుర్దా ఏఆర్‌డీఎం ప్రమోదకుమార్ బెహరా అన్నారు. పలాస రైల్వేస్టేషన్‌లో రైలు స్వాగత కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతం నుంచి ఎక్కువ మంది సూరత్, కాండ్ల, గుజరాత్, రాయపూర్, బిలాయ్ తదితర ప్రాంతాలకు వలస వెళ్తుంటారని, వారికి ఈ రైలు చాలా ఉపయోగమన్నారు. కార్యక్రమంలో డీసీఎం సుక్రాంబరో, పలాస రైల్వే మేనేజర్ ఎస్‌కే దాసు, పలాస – కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూలిన సేవా పేపరుమిల్లు బెల్ట్

● ఆలస్యంగా వెలుగులోకి..

జయపురం: జయపురం గగణాపూర్‌లోని సేవా పేపరుమిల్లు బొగ్గు రావాణా చేసే బెల్ట్(కన్వేయర్ బెల్ట్) కూలిపడింది. రెండు రోజుల కిందట జరిగిన సంఘటన శనివారం వెలుగులోనికి వచ్చింది. కన్వేయర్ బెల్టు సుమారు 40 అడుగుల పైనుంచి పడిందని.. ఆ సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేక పోవటంతో పెను ప్రమాదం తప్పింది. సేవా పేపరుమిల్లులో గత 14 నెలలుగా ఉత్పత్తి ఆగిపోయిందని అందువలన మిల్లు మూతపడటంతో మిల్లు రక్షణ పర్యవేక్షణ పూర్తిగా నిర్లక్ష్యం చేశారని పేపరుమిల్లు కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి ఆరోపించారు. ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన కన్వేయర్ బెల్ట్ స్ట్రక్చర్ గత కొన్నేళ్లుగా శిథిలావస్తలో ఉందని యాజమాన్యం దృష్టికేంద్రీకరించలేదని ఆయన ఆరోపించారు. 2020 ఆగస్టు 8 వ తేదీన కురిసిన కుండ పోత వర్షాల కారణంగా మిల్లులో పెద్ద పైకప్పు కూలిపడిందని ఆయన గుర్తు చేసారు. మిల్లు ఇలా శిథిల మౌతున్నా యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని దుయ్య బట్టారు. ఉద్యోగులకు కనీసం జీతాలు కూడా చెల్లించటంలేదని, గత 14 నెలలుగా కార్మికులకు జీతాలో చెల్లించలేదని మహంతి ఆరోపించారు.జీతాలు లభించక పోయిన కొంతమంది జీతాలు వస్తాయన్న ఆశతో డ్యూటీకి వెలుతున్నారని ఆయన వెల్లడించారు.ఆగస్టు నెల నుండి మిల్లునడుస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించినా నేటికీ ఆయన వాగ్దానం కార్యరూపం దాల్చలేదని మహంతి విమర్శించారు. మిల్లు థాపర్ గ్రూపు నుండి మదర్ అర్థ , ప్రస్తుతం మరో కంపెనీ ఇలా యాజమాన్యం మారుతున్న సమస్య ఎచ్చటేసిన గొంగలి లాగనే ఉందని విమర్శించారు. ఇటువంటి పరిస్థితిలో రోజురోజుకు మిల్లు దుర్భళ స్థితికి చేరుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.జయపురంలో ఉన్న ఏకైక ఫ్యాక్టరీ సేవా పేపరుమిల్లు అని అధోగతి స్థితికి చేరుకుంటున్నదని.. ఇప్పటికైనా మిల్లు పునరుద్దరించాలని డిమాండ్ చేశారు.



పేపరుమిల్లు పై నుండి కూలిపడిన బొగ్గు కన్వేయర్ బెల్టు

సైకో ఎవరనేది ప్రజలకు తెలుసు

● మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నిండు శాసనసభలో పద్ధతి లేకుండా జేబులో చెయ్యిపెట్టుకుని, కళ్లద్దాలు నెత్తిన పెట్టుకుని సభా సంప్రదాయాలు పాటించకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడిన బాలకృష్ణ సైకోనా.. పద్ధతిగా ఉండే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైకోనా అనేది ప్రజలందరికి తెలుసునని మాజీ శాసన సభాపతి, శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకుడు తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలసలో శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ గతంలో బెల్లంకొండ సురేష్‌పై కాల్పులు జరిపిన బాలకృష్ణను కాపాడింది ఆనాటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి అని గుర్తు చేశారు. వైఎస్సార్ కుటుంబాన్ని ఒక్క మాట కూడా అనే హక్కు వారికి లేదన్నారు. సినీ పరిశ్రమ, సినిమా హీరోలకు జగన్‌మోహన్‌రెడ్డి అంటే చాలా అభిమానం ఉందన్నారు. కరోనా సమయంలో చిరంజీవి, సినిమా హీరోలంతా కలుస్తామని అడిగితే అన్ని రకాల మర్యాదలతో కలిసి సినీ ఇండస్ట్రీ సమస్యలు పరిష్కరించింది జగన్ అని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి సైకో అని వ్యాఖ్యానించిన బాలకృష్ణ పూర్తిగా మెంటలైపోయాడేమేనని అనిపిస్తుందన్నారు. కరోనా నిబంధనల మేరకే ఐదుగురికి అవకాశం ఇస్తే చాలదు అంటే 10 మందికి అవకాశం కల్పించి విందు ఇచ్చి మరి మర్యాద చేశారని చెప్పారు. బాలకృష్ణ ఏ రకమైన సైకోనో నాకు బాగా తెలుసునని, టీడీపీలో చాలాకాలం ప్రయాణం చేశానన్నారు. బాలకృష్ణకు ఎవరైనా ఫోన్ చేస్తే ఎవడ్రా.. అని నోటికొచ్చినట్లు పిచ్చోడిలా మాట్లాడతాడని అన్నారు. వైఎస్సార్ దయాదాక్షణ్యాలతో బతుకుతున్నావన్న విషయం మరిచిపోకూడదన్నారు. పవన్, చిరంజీవి ఫ్యామిలీలతో బాలకృష్ణకు ఏమైనా పొరపొచ్చాలుంటే మీరు మీరు తేల్చుకోవాలి తప్ప జగన్‌పై అవాకులు, చవాకులు మాట్లాడితే సహించేది లేదన్నారు. బాలకృష్ణ తీరు మార్చుకోకుంటే వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న కొరాపుట్ సహకార సంస్థల డీడీ మోనిక రాయ్



వర్క్‌షాపులో పాల్గొన్న లేంప్స్, ఎస్‌హెచ్‌జీ మహిళలు

జయపురం: తర్జాతీయ సహకార సంవత్సరం 2025 సందర్భంగా శనివారం స్థానిక కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ సభాగృహంలో వర్క్‌షాప్ నిర్వహించారు. వ్యవసాయ ఉత్పత్తుకు మార్కెటింగ్ సౌకర్యం, జాతీయ సహకార డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సహకార సమితిల ద్వారా రైతులకు వివిధ వ్యవసాయ ఋణాలు సౌకర్యం సమకూర్చటం పైన చర్చించారు. క్షేత్ర స్థాయి నుంచి రైతులకు సహకార బ్యాంకు సేవలు చేర్చేందుకు అక్టోబర్ నుంచి జిల్లాలో మరో రెండు బ్యాంక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు నాబార్డ్ సీడీఎం ఎస్.కె.తలుక్‌దార్ వెల్లడించారు. వర్క్‌షాపులో కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ పరిశీలన కమిటీ అధ్యక్షులు ఈశ్వర చంద్రపాణిగ్రహి, కొరాపుట్ సహకార సంస్థల డిప్యూటీ డైరెక్టర్ మోనిక రాయ్, కార్యదర్శి హరిశ్చంద్ర బొనాగడి, నాబార్డ్ డీజీఎం దేవేంద్ర ప్రధాన్ ప్రసంగించారు.

గంగమ్మ తల్లి గుడిలో చోరీ



గుడి తలుపుల తాళం తీసి ఉన్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని చెన్నాపురంలో ఉన్న గంగమ్మ తల్లి గుడిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.50 వేలు విలువ కలిగిన వస్తువులు చోరీకి గురైనట్లు ఆలయ ధర్మకర్త ముత్తా సింహాచలం తెలిపారు. గంగమ్మ తల్లి విగ్రహం మెడలో ఉన్న రెండు గ్రాముల బంగారు శతుమానం, మూడు గ్రాముల వెండితో ఉన్న మట్టెలను దోచుకెళ్లారని తెలిపారు. అలాగే హుండీని ఎత్తుకుపోయారన్నారు. హుండీలో రూ.20 వేల వరకూ నగదు, కొన్ని వెండి వస్తువులు ఉంటాయని వివరించారు. ప్రతి ఏటా నవంబర్ నెలలో హుండీ లెక్కించి వచ్చిన డబ్బుతో అన్నదానం చేస్తామని, ఇంతలో దొంగలు చోరీకి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

సోషల్ మీడియా పోస్టులపై నిఘా

● 134 కేసుల్లో 106 మంది అరెస్టు
● డీఐజీ గోపినాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ, మహిళలను అగౌరవపరిచేలా అభ్యంతరకర పోస్టులు పెడుతున్నవారిపై గట్టి నిఘా పెట్టామని విశాఖపట్నం రేంజి డీఐజీ గోపినాథ్ జెట్టి హెచ్చరించారు. రేంజి పరిధిలోని శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం–మన్యం జిల్లాల ఎస్పీలతో పాటు డీఎస్పీలతో వర్చువల్‌గా సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. పోస్టులు మితిమీరుతుండడంతో ప్రతీ జిల్లాలో పర్యవేక్షణకు నోడల్ అధికారిని నియమించి, ప్రత్యేక బృందాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో అభ్యంతరకర పోస్టులు పెట్టేవారిని గుర్తించాలన్నారు. వారు పెట్టిన పోస్టు ఏ కేటగిరీకి వస్తుంది.. వారిపై ఎటువంటి చర్యలు చేపట్టారన్న అంశాలపై రోజువారి నివేదిక తనకు పంపాలని అధికారులను ఆదేశించారు. గుర్తించిన వ్యక్తుల వివరాలు సేకరించి, వారికి సహకరిస్తున్న వ్యక్తులను వ్యవస్థీకృత నేరమునకు సంబంధించిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలన్నారు.



వర్చువల్‌గా ఎస్పీలు, డీఎస్పీలతో మాట్లాడుతున్న డీఐజీ గోపినాథ్ జెట్టి

106 మంది అరెస్టు


రేంజి పరిధిలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన 134 మందిపై కేసులు నమోదు చేసి, 106 మందిని అరెస్టు చేశామని, 57 కేసుల్లో ఛార్జిషీటు దాఖలు చేసి 25 కేసుల్లో విచారణ ప్రారంభమైందన్నారు. డీఎస్పీలు వారి పరిధి స్టేషన్లలో ఈ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. అభ్యంతరకర పోస్టులు పెడుతున్న వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరన్నది స్పష్టం చేయాలన్నారు.

వ్యాపారస్తులు ముందుకు రావాలి

● జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, నోడల్ ఆఫీసర్ స్వప్న దేవి

శ్రీకాకుళం పాతబస్టాండ్:

జీఎస్టీ తగ్గిన నేపథ్యంలో ధరలు తగ్గించేందుకు వ్యాపారస్తులు వాలంటీర్‌గా ముందుకు రావాలని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ నోడల్ అధికారి స్వప్నదేవి కోరారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జీఎస్టీ ధరల తగ్గింపుపై వ్యాపారస్తులతో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్స్, మెడికల్, ఆటోమొబైల్స్, వ్యవసాయానికి సంబంధించి యంత్రాలు, ఎరువులు, ప్యాకింగ్ మెటీరియల్, హెల్త్ ఇన్సూరెన్స్‌పై తగ్గింపులు వలన ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజల వద్ద డబ్బులు ఉంటే మరింతగా వ్యాపారాలు జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు షాపుల వద్ద పాత ధరలు, కొత్త ధరల బ్యానర్లు ప్రదర్శించాలని సూచించారు. వ్యాపారస్తులకు ఉన్న అనుమానాలను జీఎస్టీ నోడల్ అధికారి నివృత్తి చేశారు. సమావేశంలో అసిస్టెంట్ జీఎస్టీ అధికారి చంద్రకళ, కాశీబుగ్గ, నరసన్నపేట, ఆమదాలవలస అసిస్టెంట్ జీఎస్టీ అధికారులు, బంగారం వ్యాపారస్తులు, రైస్ మిల్లర్స్, హోటల్స్, కిరాణా, ఆటో మొబైల్స్, సిమెంటు తదితరులు వ్యాపారస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ స్వప్న దేవి

నూతన డీసీసీ అధ్యక్షులకు అభినందనలు



కొరాపుట్: కొరాపుట్ డీసీసీ అధ్యక్షుడు రూపక్ తురుక్‌ని అభినందిస్తున్న సీఎల్పీ నాయకుడు రాంచంద్ర ఖడం

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో నూతనంగా నియమితులైన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుల నియామకంపై అభినందనలు వెల్లువెత్తాయి. కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు రూపక్ తురుక్‌ని జిల్లాకు చెందిన కాంగ్రెస్ శాసన సభాపక్ష నాయకుడు రామచంద్ర ఖడం శనివారం అభినందించారు. నబరంగ్‌పూర్ జిల్లా నుంచి జిల్లా పరిషత్ సభ్యురాలు డాక్టర్ లిఫికా మజ్జి డీసీసీ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈమె మాజీ ఎమ్మెల్యే భుజబల్ మజ్జి కుమార్తె. నబరంగ్‌పూర్ జిల్లాలో 26 జెడ్పీ స్థానాలకు లిఫికా ఒక్కరే కాంగ్రెస్ నుంచి గెలిపొందారు. ఈ విడత రెండు జిల్లాల్లో యువతకే అధ్యక్ష పదవులు దక్కాయి. వీరిద్దరి ఎంపిక వెనుక కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క ముద్ర ఉందని కాంగ్రెస్ అభిమానులు పేర్కొంటున్నారు.



కొరాపుట్: నబరంగ్‌పూర్ డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ లిఫికా మజ్జి

డీసీసీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సాధరణ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ప్రకటించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు గోవింద పాత్రో అధ్యక్షతన నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావును శనివారం సత్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.



మల్కన్‌గిరి: శ్రీనివాసరావును సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా దేవీ శరన్నవరాత్రి పూజలు



లలితా సహస్రనామ పారాయణం



లలితా అమ్మవారి అలంకరణలో అమ్మవారు



108 కలశాలతో పంచామృతాభిషేకాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు భక్తులకు లలితాదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక కస్తూరీనగర్‌లోని సత్యనారాయణ స్వామి మందిరంలో అర్చకులు మావుడూరు కిషోర్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాణిగుడఫారంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో అమ్మవారికి వేదపండితులు రేజేటి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో 108 కలశాలతో పంచామృతాభిషేకం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై లలితా సహస్ర నామ పారాయణం చేశారు.

రాయగడ

క్లుప్తంగా

జీఎస్టీ 2.0పై విస్తృత అవగాహన

- జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురం రూరల్: జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు కలిగే లాభాలను ప్రతి కుటుంబానికి స్పష్టంగా వివరించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీఎస్టీ 2.0కింద సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరిట సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 19 వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జేసీ మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, మందులు, విద్య, వస్త్రాలు, రవాణా వంటి విభాగాల్లో జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను ఇంటింటికి తెలియజేయాలని సూచించారు. ఇందుకోసం ఎస్‌హెచ్‌జీ మహిళలు, గ్రామ కార్యదర్శులు, అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం ఇంటింటికీ వెళ్లి నిత్యవసరాలపై లబ్ధిని తెలియజేయాలన్నారు. చివరిగా వచ్చేనెల 19న జిల్లాస్థాయిలో భారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, వాణిజ్య పన్నులశాఖ ఉప కమిషనర్ డేవిడ్ అనిల్, ఎస్‌డీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురం డివిజన్‌లో అంతర్‌రాష్ట్ర దొంగ సంచారం




కేరళ రాష్ట్రానికి చెందిన వేదాలం గోపాలం నాయర్

పార్వతీపురం రూరల్: పార్వతీపురం పోలీస్ శాఖ డివిజన్ పరిధిలో దేవాలయాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఓ అంతర్‌రాష్ట్ర దొంగ సంచరిస్తున్నాడని, ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం పట్టణ, రూరల్ పోలీసులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళ రాష్ట్రానికి చెందిన వేదాలం గోపాలం నాయర్ అనే వ్యక్తి పగటిపూట దేవాలయాల వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో హుండీలను పగలగొట్టి దొంగతనాలకు పాల్పడడంలో సిద్ధహస్తుడని తెలిపారు. ఈ మేరకు విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ వ్యక్తిపై ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో గతంలోనే సుమారు 10కి పైగా కేసులు నమోదయ్యాయని, జైలుకు వెళ్లి శిక్ష కూడా అనుభవించాడని పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం వంగర, గరుగుబిల్లి మండలాల్లో ఈ వ్యక్తి సంచరిస్తున్నట్లు బలమైన అనుమానాలున్నాయని తెలిపారు. తెల్ల చొక్కా ధరించి, చేతిలో సంచితో అనుమానాస్పదంగా రోడ్లపై తిరుగుతూ లిఫ్ట్ అడుగుతుంటాడని వివరించారు. ఈ వ్యక్తి ఎక్కడ కనిపించినా, ఎలాంటి స్థితిలో ఉన్నా వెంటనే నిలువరించి, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు గాని లేదా డయల్ 100కు గాని సమాచారం అందించాలని ప్రజలను కోరారు. అపరిచితులకు వాహనాలపై లిఫ్ట్ ఇవ్వవద్దని, పరిసరాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతుంటే తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా పైడితల్లి ఉత్సవాలు

విజయనగరం క్రైమ్: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి అన్నారు. తన చాంబర్‌లో ఉత్సవ సమన్వయ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. వాతావరణ పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. గుడి లోపల తోపులాటలు జరిగే అవకాశం ఉన్నందున క్యూలైన్లలో దర్శనాలు జరిగేలా చూడాలన్నారు. వీఐపీ దర్శనాలను ఒక్క నిమిషంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇంటర్ పరీక్ష ఫీజులకు వేళాయె..!



బోధనలో నిమగ్నమైన ఇంటర్ విద్యార్థులు

- అక్టోబర్ 10తో ముగియనున్న గడువు
- గడువు ముగిశాక రూ.వెయ్యి అపరాధ రుసుం
- సకాలంలో ఫీజులు చెల్లించాలంటున్న అధికారులు

పాలకొండ రూరల్: రానున్న ఏడాదిలో నిర్వహించనున్న ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించి ఫీజుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ క్రమంలో ఎటువంటి అపరాధ రుసుము లేకుండా అక్టోబర్ 10వ తేదీ తుది గడువుగా సంబంధిత బోర్డు స్పష్టం చేసింది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజుల స్వీకరణకు వచ్చే నెల 10 వరకు గడువు నిర్దేశించిన సంబంధిత బోర్డు 11 నుంచి 21 తేదీల మధ్య రూ.వెయ్యి అపరాధ రుసుముతో కలిపి చెల్లించేలా అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో సదరు విద్యార్థులు అదనపు మొత్తం చెల్లించే అవకాశం ఇవ్వకుండా వచ్చే నెలలోగా చెల్లించడం ఉత్తమమని కళాశాలల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.

ఫీజుల చెల్లింపు ఇలా..

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించిన జనరల్, ఒకేషనల్ విద్యార్థులు థియరీ పరీక్షల కోసం రూ.600, జనరల్ కోర్సులు చదువుతున్న ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు రూ.275 చెల్లించాల్సి ఉంటుంది. ఒకేషనల్ కోర్సులు చదువుతూ బ్రిడ్జి కోర్సు చేసే విద్యార్థులు బ్రిడ్జి సబ్జెక్టులకు పరీక్ష ఫీజుగా రూ.165 చెల్లించాలి. ద్వితీయ సంవత్సరం చదువుతూ మొదటి సంవత్సరం పరీక్షలు తప్పిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ ఏడాదులకు థియరీ ఫీజుతో కలిపి రూ.1,200 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సులు చదువుతూ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్‌కు హాజరు కావాల్సిన విద్యార్థులు రెండేళ్లకు కలిపి రూ.550 చెల్లించాలి. బ్రిడ్జి కోర్సులు చదువుతున్న విద్యార్థులు రెండేళ్లకు రూ.330 చెల్లించాలి. ప్రథమ, ద్వితీయ ఏడాదుల్లో ఉత్తీర్ణత పొంది మార్కులు పెంచుకునేందుకు పరీక్షలు రాయదలచిన ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,350, సైన్స్ విద్యార్థులు రూ.1,600 ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాలో కళాశాలలు

పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని 15 మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు-14, హైస్కూల్ ప్లస్-2, కేజీబీవీలు-14, మోడల్ స్కూల్స్-4, సాంఘిక సంక్షేమ కళాశాలలు-5, గిరిజన సంక్షేమ కళాశాలలు-9, ప్రైవేట్ విభాగంలో 38 జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం -9,050మంది, ద్వితీయ సంవత్సరం 9,100 మంది విద్యార్థులు బోధన పొందుతున్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాల్లో 2,165 పైచిలుకు విద్యార్థులు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

సకాలంలో చెల్లిస్తే మేలు

ఫీజుల స్వీకరణ ప్రారంభమైంది. విద్యార్థులు ఈ విషయం గమనించి సకాలంలో నిర్దేశిత ఫీజులు చెల్లించాలి. లేకుంటే అధనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన 86 జూనియర్ కళాశాలలకు ఆదేశాలు అందించాం. యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించి, నిర్దేశిత గడువు ముగిసే సమయానికి శతశాతం ఫీజులు చెల్లించేలా చూడాలి. లేకుంటే విద్యార్థులపై అదనపు భారం పడుతుంది.

– వై.నాగేశ్వరరావు, డీఐఈవో, పార్వతీపురం మన్యం

నిందితులకు శిక్ష పడేలా చర్యలు

- కోర్టు కానిస్టేబుల్స్‌తో ఎస్పీ సమీక్ష



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్, చిత్రంలో ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: గ్రేవ్ కేసుల్లో పట్టుబడిన నిందితులకు శిక్షలు పడేలా కోర్టు కానిస్టేబుల్స్ సమర్థవంతంగా పని చేయాలని ఎస్పీ దామోదర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన డీపీఓ నుంచి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు మానిటరింగ్ అధికారులు, హెచ్‌సీలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, న్యాయస్థానాల్లో వ్యవహరించాల్సిన తీరు గురించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో నిందితులు న్యాయస్థానాల్లో శిక్షకు గురయ్యే విధంగా చేయడంలో కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు మానిటరింగ్ స్టాఫ్ పాత్ర క్రియాశీలకమని స్పష్టం చేశారు. కేసుల విచారణ సమయంలో నిందితులపై నేరారోపణలు రుజువు చేసేందుకు సాక్షులు సకాలంలో హాజరయ్యేందుకు సమన్లు జారీ చేయాలని చెప్పారు. కోర్టులు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేసి, నిందితులు కోర్టు వాయిదాలకు రెగ్యులర్‌గా హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ప్రాసిక్యూషన్ జరుగుతున్న సమయాల్లో సంబంధిత డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు కోర్టులకు హాజరై, ప్రాసిక్యూషన్ జరుగుతున్న తీరును గమనించాలని ఆదేశించారు. సమష్టిగా, సమన్వయంతో నిందితులకు శిక్ష పడే విధంగా సమర్థవంతంగా పని చేసే వారికి ప్రోత్సాహక బహుమతులు, రివార్డులను అందిస్తామని ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. ఈ జూమ్ మీటింగ్‌లో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, పలువురు సీఐలు, ఎస్సైలు, లైజనింగ్ అధికారులు, కోర్టు మానిటరింగ్ స్టాఫ్, కోర్టు విధులు నిర్వహించే హెచ్‌సీలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

అభ్యంతరకర పోస్టులు పెడితే వ్యవస్థీకృత నేరం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్ /విజయనగరం క్రైమ్: సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని అభ్యంతరకర, అసభ్యకరమైన పోస్టులు పెట్టే వారిపై పోలీసుశాఖ చర్యలు తీసుకోనున్నట్లు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి స్పష్టం చేసినట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విశాఖ రేంజ్ డీఐజీ పలు జిల్లాల ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాధవ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను అగౌరవపరిచేలా, సమాజంలో అశాంతిని రెచ్చగొట్టేలా పోస్టు సృష్టించేవారిని ఉపేక్షించేదే లేదని, వారిని వ్యవస్థీకృత నేరగాళ్లుగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని డీఐజీ ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు ప్రత్యేక బృందాలతో నిరంతర నిఘా పెట్టి సోషల్ మీడియాలో పెట్టే ప్రతీపోస్టును క్షుణ్ణంగా పరిశీలించేందుకు కార్యాచరణ చేశామన్నారు. ఈ నేరాల నియంత్రణకు ప్రతి జిల్లాలో ఒక నోడల్ అధికారిని నియమించి వారి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాల ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

విజయనగరం ఎస్పీ దామోదర్ కూడా డీఐజీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సోషల్ మీడియా పోస్టులపై దృష్టి పెట్టాలని డీఐజీ సూచించినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు.

కారు ఢీకొని ఒకరి మృతి

సీతానగరం: జాతీయరహదారిపై సీతానగరం మండలం మరిపివలస వద్ద శనివారం రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం పాచలవలసకు చెందిన సిరిపురం రాము(54) శనివారం మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో మరిపివలసలో కాలినడక రోడ్డు దాటుతుండగా పార్వతీపురం నుంచి బొబ్బిలి వస్తున్న కారు ఢీ కొట్టడంతో రోడ్డుపై పడిపోగా తలకు గాయాలవడంతో చికిత్స నిమిత్తం బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3 గంటలకు మృతిచెందాడు. మృతుడి కుమార్తె రమ్య సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసున మోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం. రాజేష్ తెలియజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.

గెడ్డలో మహిళ మృతదేహం



రాతు చిన్నమ్మడు (ఫైల్)

వీరఘట్టం: మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన రాతు చిన్నమ్మడు(59) బహిర్భూమికి వెళ్లి చివరకు గెడ్డలో శవమై తేలింది. ఆమె మృతిపై ఏఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని శనివారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన చినమ్మడు మానసిక స్థితి బాగులేదని, ఆమె ఈనెల 21న ఇంటి నుంచి బహిర్భూమి కోసం వెళ్లిందని, కుటుంబ సభ్యులు రెండు రోజుల పాటు సమీప బంధువులు, చుట్టాల ఇళ్ల వద్ద వెతికినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో ఈనెల 23న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమె కుమారుడు అప్పలరాజు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో కొట్టుగుమ్మడకు వెళ్లే తోవలో ఉన్న బ్రిడ్జి సమీపంలో గెడ్డలో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వచ్చి పరిశీలించి ఆమెను కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన చిన్నమ్మడుగా గుర్తించారు. అనంతరం పెద్దల సమక్షంలో పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహం తరలించారు.

చెరువులో పడి భవానీ మాలాధారుడి మృతి



సాయిసతీష్ (ఫైల్)

బొబ్బిలిరూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామానికి చెందిన మడి సాయి సతీష్(24) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. దీనిపై ఏఎస్సై కొండల రావు తెలిపిన వివరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం అన్నసమారాధనకు వెళ్లేందుకు సిద్ధమై స్థానిక ఎర్రకోనేరులో స్నానానికి దిగి కాలు జారి పడిపోయిన సాయి సతీష్ కేకలు వేయడంతో సహచర భవానీ భక్తులు రక్షించేందుకు ప్రయత్నించగా అప్పటికే స్పృహ కోల్పోయి కొన ఊపిరితో ఉండడంతో బొబ్బిలి సీహెచ్‌సీ హుటాహుటిన తరలించారు. దీంతో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి అచ్యుత రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలియజేశారు. సాయి సతీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించామని ఏఎస్సై తెలిపారు. మృతుడు సాయిసతీష్ డిప్లమోచదువుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడని, ఇంతలో ఇలా జరిగిందని తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- నెలాఖరు వరకు అవకాశం
- ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం



బలిజిపేట ఉన్నత పాఠశాలలో పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

బలిజిపేట/రాజాం: ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం 2008నుంచి జాతీయ ప్రతిభా ఉపకారవేతనం(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పథకాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు ఈ పరీక్ష రాసి ఎంపికైతే వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందిస్తుంది.

ఎవరు అర్హులు

ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసేందుకు 2025-26విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకుల, కస్తూర్బా, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల విద్యార్థులు అర్హులు. తల్లితండ్రుల వార్షిక ఆదాయం రూ.3.5లక్షల లోపు ఉండాలి. పరీక్షను ఈ ఏడాది డిసెంబర్ 7న నిర్వహించనున్నారు. అర్హులైన వారు పాఠశాల యాజమాన్య వెబ్‌సైట్‌లో ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50లు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా పరీక్ష రుసుం చెల్లించాలి.

ఇది ఎంతో ఉపయోగకరం



8వ తరగతి విద్యార్థులకు ఇటువంటి పరీక్ష నిర్వహించడం వల్ల వారికి రానున్న తరగతుల్లో మంచి విద్యపై పునాది పడుతుంది. ఇతరత్రా కాంపిటేషన్ పరీక్షలకు వెళ్లేటప్పుడు ఇది ఉపయోగపడుతుంది. పేద విద్యార్థులకు ఉపకార వేతనం చదువుకునేందుకు ఆసరాగా ఉంటుంది.

– వి.వెంకటనాయుడు, ప్రధానోపాధ్యాయుడు, బలిజిపేట ఉన్నత పాఠశాల

శాశ్వత లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం లీగల్: శాశ్వత ప్రజా న్యాయ పీఠం సేవలను అందరూ వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత అన్నారు. ఈ మేరకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు, అనధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ శాశ్వత ప్రజా న్యాయపీఠం సేవలను అందరూ వినియోగించుకోవాలని సూచించారు. శాశ్వత న్యాయ పీఠం ఈ కింది సేవలకు సంబంధించిన తగాదాలను రాజీ మార్గం ద్వారా లేదా తుది తీర్పు ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. బీమా, బ్యాకింగ్, ఆర్థిక సంస్థలు, విద్యాసంస్థలు, ప్రయాణికులు, వస్తువులు చేరవేసే రోడ్డు, వాయు, జల రవాణా సేవలు, పోస్టల్ టెలిఫోన్ టెలిగ్రాఫ్ సేవలు, ప్రజలకు సప్లై చేసే విద్యుత్, కాంతి, నీటి సరఫరా సేవలు, ప్రజారక్షణ వ్యవస్థ, పారిశుద్ధ్య సేవలు ఆస్పత్రి లేక నర్సింగ్ హోమ్ సేవలకు సంబంధించిన తగాదాలను రాజీమార్గం ద్వారా కానీ లేదా తుది తీర్పు ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. ఇది సులువైన ప్రత్యామ్నాయ పరిష్కారమని చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీ దుర్గయ్య, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ. కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ధ్వంసం చేసిన పంట పరిశీలన



ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయశాఖాధికారి అశోక్

పార్వతీపురం రూరల్: నాలుగు రోజుల క్రితం ప్రవేశించిన ఏనుగుల గుంపు పార్వతీపురం మండలంలోని చినమరికి, పెదమరికి, బండిదొరవలస తదితర గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ భూముల్లో పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పగలంతా సమీపంలో గల చెరువులు, తోటల్లో తిష్టవేస్తున్న ఏనుగుల గుంపు రాత్రి అయితే బండిదొరవలస సమీపంలో రహదారి పక్కనున్న మొక్కజొన్న పంట పొలంలో సేదదీరుతూ పంటను నాశనం చేస్తున్నాయి. అయితే గురువారం, శుక్రవారం డొల్లు పారినాయుడుతో పాటు మరికొంతమంది రైతులకు చెందిన మొక్కజొన్న పంటలను ఏనుగులు ధ్వంసం చేసిన నేపథ్యంలో మండల వ్యవసాయశాఖాధికారి అశోక్ నేరుగా గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు బాధిత రైతులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు.

పొట్టచేతబట్టుకుని వెళ్లి..

- రాయపూర్‌లో గరివిడి వ్యక్తి మృతి
- ఉద్యోగంలో చేరిన నెల గడవక ముందే ప్రమాదం
- అనాథలైన భార్యాపిల్లలు



ప్రమాదంలో మృతి చెందిన ప్రసన్నకుమార్

చీపురుపల్లి రూరల్(గరివిడి): కుటుంబపోషణ కోసం పొట్ట చేతబట్టుకుని ఊరికాని ఊరు వెళ్లిన గరివిడికి చెందిన కె. ప్రసన్నకుమార్ (45) ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని రాయపూర్‌లో గల గోదావరి స్టీల్ ప్లాంట్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ సంఘటనకు సంబంధించి కుటుంబసభ్యులు స్థానికులు తెలిపిన వివరాల మేరకు ప్రసన్నకుమార్‌కు రాయపూర్‌లో గల గోదావరి స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగావకాశం రావడంతో 20 రోజుల క్రితం ఇంజినీర్ హోదాలో ఉద్యోగంలో చేరారు. అప్పటినుంచి భార్యాపిల్లలను గరివిడిలో ఉంచి తాను రాయపూర్‌లో ఒక రూమ్ అద్దెకు తీసుకుని ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. రాయపూర్‌లో అంతా అనుకూలంగా ఉండడంతో పిల్లలను తీసుకుని తన వద్దకు వచ్చేయాలని భార్యకు చెప్పాడు. ఈ మేరకు భార్య భవాని తన ఇద్దరు పిల్లలతో వెళ్లేందుకు సిద్ధమవ్వగా, వారికి తోడుగా మృతుని అన్నయ్య కూడా బయల్దేరాడు. వారంతా రాయపూర్ ప్రయాణమై మార్గమధ్యంలో ఉండగానే స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో ప్రసన్నకుమార్ మృతి చెందాడన్న వార్త తెలియడంతో దారిలోనే కుప్పకూలిపోయారు. ప్లాంట్‌లో నిర్మాణం జరుగుతున్న సమయంలో బీమ్ పడిపోవడంతో సంఘటన స్థలంలోనే ప్రసన్నకుమార్ ప్రాణాలు విడిచాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబపెద్ద మృతితో భార్యా పిల్లలు అనాథలుగా మిగిలారు. ఈ సంఘటనతో గరివిడి పట్టణంలోని టీచర్స్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కార్పొరేటర్‌ను శిక్షించాలి



సాలూరులో నిరసన తెలిపిన మున్సిపల్ కార్మికులు

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్
- మున్సిపల్ వర్కర్‌ను జనసేన కార్పొరేటర్ దూషించడంపై నిరసన

మక్కువ/సాలూరు: గుంటూరు తూర్పు నియోజకవర్గం 13వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు దేవరపద్మను జనసేన పార్టీ కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు నోటికి వచ్చినట్లు దూషించడాన్ని సాలూరు మున్సిపల్ వర్కర్స్ శనివారం ఖండించారు. సాలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.శంకరరావు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పోలీసులు తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుద్ధ్యకార్మికులు చేసిన సేవలను ప్రజలు గుర్తించుకున్న విషయాన్ని, కార్పొరేటర్ శ్రీనివాసరావు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు పోలరాజు, అర్జున్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులపై పోలీసుల కొరడా..!

- జనవరి నుంచి 2300 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు
- జరిమానా వసూలు



పార్వతీపురం బైపాస్ రోడ్డులో బ్రీత్ ఎనలైజర్‌తో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పట్టణ పోలీసులు

పార్వతీపురం రూరల్:

మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారా? అయితే మీ జేబుకు చిల్లు పడడం ఖాయం. మీ నిర్లక్ష్యం ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకముందే మేల్కోవాలి. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మన్యం జిల్లా పోలీసులు 'డ్రంకెన్ డ్రైవ్' పై కొరడా ఝుళిపిస్తున్నారు. నిబంధనలను బేఖాతరు చేస్తున్న మందుబాబులపై కఠినంగా వ్యవహరిస్తూ, వారిని న్యాయస్థానం ముందు నిలబెడుతున్నారు. భారీ జరిమానాతో పాటు, తీవ్రమైన సందర్భాల్లో జైలు శిక్ష పడే అవకాశం ఉందని తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

లెక్కలు చూస్తే గుండె గుభేల్!

జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల సంఖ్య, విధించిన జరిమానాల వివరాలు చూస్తే ఆశ్చర్యం కలగకమానదు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఏకంగా 2300 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణ పరిధిలోనే సుమారు 300 మందిని పట్టుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారందరికీ కలిపి ఏకంగా రూ.30 లక్షల జరిమానా విధించింది. అయినప్పటికీ కొందరిలో మార్పు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

అవగాహనతో పాటు..కఠిన చర్యలు

ఒకవైపు అవగాహన కల్పిస్తూనే, మరోవైపు తనిఖీలతో పోలీసులు వాహనదారుల్లో భయం కలిగిస్తున్నారు. ఎక్కడికక్కడ బ్రీత్ ఎనలైజర్లతో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకుంటున్నారు. ముఖ్యంగా పట్టణ శివారు ప్రాంతాలు, జాతీయ రహదారులపై రాత్రి వేళ తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు యువకులు, వాహనదారులు శివారు ప్రాంతాల్లో మద్యం తాగి అదే మత్తులో ప్రమాదకరంగా వాహనాలు నడుపుతూ తమ ప్రాణాలనే కాకుండా, ఎదుటివారి ప్రాణాలను కూడా పణంగా పెడుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు



జిల్లాలో ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రజా భద్రతే లక్ష్యంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మద్యం తాగి వాహనాలు నడపడం కేవలం చట్టాన్ని ఉల్లంఘించడం మాత్రమే కాదు. తమ ప్రాణాలతోపాటు అమాయకుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టడమే. ఇలాంటి నిర్లక్ష్య వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదు. పోలీసుశాఖ ఉద్దేశం జరిమానాలు విధించడం కాదు. ప్రజల ప్రాణాలను కాపాడడం. యువత ప్రత్యేకంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

– ఎస్‌వీ మాధవ్ రెడ్డి, ఎస్పీ, పార్వతీపురం మన్యం